నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
ఆదివారం 22-02-2026

కాశీ క్షేత్రం...

సీ.
గంగలో స్నానాలు గతజన్మపాపాలు
కర్మ ఫలము నంత కడిగి వేయు
ఆత్మ శుద్ధియు కల్గి యరివర్గమును పార
ద్రోలగా చేయుచు మేలొసంగు
జన్మకారకులిక సంతోషభరితులై
దీవెనల్ కురిపించి తృప్తి గాను
ఆధ్యాత్మికతవైపు నడుగులేయగజేసి
భక్తి మార్గమునందు పట్టి నిలుపు

తే.గీ.
యజ్ఞ యాగాదులొసగెడి యద్భుతమగు
పుణ్య సంపద సమకూరి పూజ్యుడగును
సకల భక్త మోక్షప్రద స్థావరమ్ము
శివ కృపా లబ్ధవరము కాశీపురమ్ము.

జి.గోవర్ధన్, తెలుగు లెక్చరర్,
ఎం.వి.ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలెం,
మహబూబ్ నగర్ 509001



నేటికీ సామాజిక మార్పులకు ప్రేరణనిచ్చే ఒక క్లాసిక్

గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం ఆనాటి సామాజిక, ఈనాటి రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులకు ప్రతిబింబంగా నిలిచింది. ఈ నాటకం ద్వారా 19వ శతాబ్దం చివరి, 20వ శతాబ్దం ప్రారంభంలో తెలుగు సమాజంలోని అసమానతలు, సంస్కరణ అవసరాలు, స్త్రీ పునర్వివాహాలు, బాల్య వివాహాలు, కన్యాశుల్కం (బాలికలను డబ్బుకు అమ్మడం) వంటి అనాచారాలపై తీవ్ర విమర్శలు చేయబడ్డాయి.

అగ్నిహోత్రావధాన్లు తన చిన్న కుమార్తెను 70 ఏళ్ల ముసలి వ్యక్తికి డబ్బుకోసం ఇచ్చే సన్నివేశం, ఆనాటి సమాజంలో బాలికలను వస్తువుగా చూసే మానసికతను బహిర్గతం చేస్తుంది. ఇది స్త్రీలపట్ల సమాజంలోని ఆర్థిక-సామాజిక అణచివేతను సూచిస్తుంది. బుచ్చెమ్మ విధవగా మాతృగృహంలో బాధపడుతున్న స్థితి, విధవల పునర్వివాహాల అసాధ్యత, సామాజిక కట్టుబాట్లను వివరిస్తుంది. మొదటి కూర్పులో "చౌకబారు వేశ్య" గా చిత్రించబడిన మధురవాణి, రెండవ కూర్పులో వివేకవంతమైన, నైతిక స్ఫూర్తితో కూడిన పాత్రగా మారడం, సమాజంలో వేశ్యల పట్ల ఉన్న పూర్వగ్రహాలను తిప్పికొట్టే ప్రయత్నాన్ని సూచిస్తుంది. ఇది సంఘ సంస్కరణోద్యమాల ప్రభావాన్ని కూడా ప్రతిబింబిస్తుంది.

లుబ్ధావధాన్లుపై దావా తెచ్చి, సౌజన్యారావు పంతులు వంటి సంస్కరణవాది లాయర్ ద్వారా కేసును నడిపించడం, ఆనాటి కాలంలో న్యాయపరమైన పరిష్కారాలపై ఉన్న ఆశావాదాన్ని చూపిస్తుంది. అయితే, ఇది బ్రిటిష్ ప్రభావంతో కూడిన న్యాయవ్యవస్థ సామాజిక సమస్యలకు పరిష్కారాన్ని అందించగలదన్న నమ్మకాన్ని కూడా సూచిస్తుంది. నియోగి (బ్రాహ్మణ) సమాజంలోని అధికారిక స్థానాలు, వైదిక పాత్రలు (రామప్పంతులు మొదలైనవి)కుల ఆధిపత్యాన్ని వివరిస్తాయి. అగ్నిహోత్రావధాన్లు వంటి పాత్రలు కులం, ఆర్థిక హక్కులను ఎలా దుర్వినియోగం చేస్తున్నారో నాటకం వివరిస్తుంది.

బుచ్చెమ్మను "వస్తువుగా" చూసే సంప్రదాయవాదికి, మధురవాణి, సౌజన్యారావుపంతులువంటి సంస్కరణవాదుల మధ్య ఘర్షణ సాంస్కృతిక మార్పుల సూచన.

చివరిలో బుచ్చె మ్మను శరణాలయానికి పంపడం, స్త్రీలకు స్వతంత్ర జీవిత అవకాశాల గురించి ఆలోచనను ప్రారంభించింది. గిరీశం వంటి మోసకాడు, లుబ్ధావధాన్లు వంటి లోభి పాత్రలను హాస్యాస్పదం చేయడం ద్వారా, సమాజంలోని అనైతికతను గురజాడ తీవ్రంగా విమర్శించాడు. ఈ శైలి ఆనాటి సాహిత్యంలో సామాజిక మార్పులకు ఒక సాధనంగా పనిచేసింది.

నాటకంలోవ్యావహారిక భాషా శైలి కనిపిస్తుంది. సాంప్రదాయిక గ్రంథ భాషకు భిన్నంగా, సామాన్య ప్రజల మాట్లాటను ప్రతిబింబిస్తుంది. ఇది ఆధునిక తెలుగు సాహిత్యంలో భాషా సంస్కరణకు దారితీసిన ముఖ్యమైన మలుపు. అగ్నిహోత్రావధాన్లు తన కుటుంబాన్ని నిలబెట్టడానికి కన్యాశుల్కాన్ని ఆధారం చేసుకోవడం, ఆర్థిక సంక్షోభం ఎలా నైతికతను కరిగిస్తుందో చూపిస్తుంది. సమాజంలోని అజ్ఞానం మరియు ఆర్థిక బలహీనతలను ఉపయోగించుకునే వ్యక్తుల పాత్రలు, ఆనాటి సమాజంలో విస్తరించిన మోసాలను బహిర్గతం చేస్తాయి.

కన్యాశుల్కం నాటకం రెండు కూర్పులను ప్రచురించారు. మొదటి కూర్పు 1897 లో ప్రచురించబడింది. ఈ నాటకం మొట్టమొదటి ప్రదర్శన 1892 ఆగస్టు 13న విజయనగరం లో జరిగింది. అంతకు ముందు 5 సంవత్సరాల క్రితం ఈ రచన జరిగిందని తెలుస్తోంది. అయితే 1909లో ప్రచురించిన రెండవ కూర్పే ప్రస్తుతం అత్యంత ప్రాచుర్యం పొంది, ప్రజాదరణ పొందిన కన్యాశుల్కం. రెండవ కూర్పులో మధురవాణి పాత్ర యొక్క ఉన్నతీకరణ, సంభాషణలలో నైపుణ్యం, హాస్యం యొక్క సునిశితత్వం గురజాడ యొక్క పరిపక్వతను చూపుతాయి. ఇది సామాజిక స్పృహలో పెరిగిన మార్పులను కూడా సూచిస్తుంది. కన్యాశుల్కము మొదటి కూర్పు ప్రచురితమైన దాదాపు పదేళ్ళు గడిచిన తర్వాత 1908లో కన్యాశుల్కము విజయనగరంలో ప్రదర్శితమైందన్న ప్రోత్సాహకరమైన వార్తను మహారాజా ద్వారా తెలుసుకోవడంతో గురజాడ కొద్ది మార్పులతో రెండవ ముద్రణకు పూనుకున్నాడు. అయితే ఎస్.శ్రీనివాస అయ్యంగార్ సూచన మేరకు, ఆ నడుమ కాలంలో గురజాడ దృక్పథంలోనూ, అనుభవంలోనూ వచ్చిన పరిణతి మేరకు కొద్ది మార్పులు కాక, నాటకం చాలావరకూ మార్చివేసి రెండవ కూర్పు చేసి ప్రచురించాడు.

రెండవ కూర్పులో సంభాషణల నైపుణ్యం, వ్యావహారికశైలి అభివృద్ధి చెందడం, కొన్ని పాత్రలు తీసివేయడం, కొన్ని చేరడం, రామప్పంతులు వైదీకి నుంచి నియోగి కావడం, అనేక పాత్రల ప్రవర్తనల్లో ఔచిత్యం పెరగడం, సంభాషణల హాస్యస్ఫోరకత అభివృద్ధి అవడం వంటి మార్పులు జరిగాయి. ప్రధానంగా మొదటి కూర్పులో చౌకబారు వేశ్య పాత్ర నుంచి అత్యుత్తమమైన వివేకం, నీతి కలిగిన పాత్రగా రెండవ కూర్పు నాటికి మధురవాణి రూపొందడం ప్రధానమైన విశేషం. అలానే రెండవ కూర్పులో సంభాషణలు, సన్నివేశాలు పెరిగి నాటకం చాలా విస్తరించిందనీ, తద్వారా ఏకోన్ముఖత, ప్రదర్శన యోగ్యత దెబ్బతిందని విమర్శకులు కొందరు భావించారు. రెండవ కూర్పు ప్రచురణ తర్వాత నాటకం విస్తృతమైన ప్రజాదరణ పొందడం, సంఘసంస్కరణలపై ప్రజల్లో మానసికస్థితిగతుల్ల మార్పులెన్నింటినో సూచిస్తుంది. ఆనాటి సమాజంలోని వెలితిని, కులవ్యవస్థ, లింగ అసమానతలు, ఆర్థిక సంక్షోభం వంటి అంశాలను వ్యంగ్యం, నాటకీయత ద్వారా బహిర్గతం చేసింది. గురజాడ సంస్కరణావాది హృదయంతో, సమాజంలోని అంధవిశ్వాసాలను ధిక్కరించి, మానవతా విలువలను ప్రతిఘటించాడు.

ఈ నాటకం నేటికీ సామాజిక మార్పులకు ప్రేరణనిచ్చే ఒక క్లాసిక్‌గా నిలిచింది.

డా. ఎం. మంజుశ్రీ
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ,
డా.ఏ.పి.జే అబ్దుల్ కలాం,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
పటాన్ చెరువు, తెలంగాణ.

పవిత్ర జలం

మనం
అందరి ముందు
నవ్వుపించాన్ని
ధైర్యంగా విప్పగలం

కన్నీటి చుక్కల్నెందుకో
రాల్చడానికి భయపడుతుంటాం

ఏడుపంటే
ఎవరికి ఇష్టముండదు గాని
పుట్టుకతో తోడచ్చే
గొప్ప వరం ఏడ్వడం

చిన్నప్పుడు ఏడుపే
మన ఆకలికి చేయూత

ఏడుపు
బాధల్ని తగ్గించే ఔషధం
ఒంటరితనంలో
తోడిచ్చే స్నేహం
మనసుకంటిన
బాధల మరకలను
కడిగే సరుపు

అప్పుడప్పుడైన ఏకాంతాన్ని
గుప్పిట్లో బంధిస్తుండాలి
బాధల మూటల్ని విప్పి
మనసారా ఏడ్చేయాలి

ఎంత కన్నీళ్ళను
ఖర్చుపెడుతామో
అంత ఆనందభాష్పాలను
ఆదా చేసినట్లే

నవ్వు ఏడుపులలో
ఏది గొప్పదంటే
ఏడుపే గొప్పదని
నిక్కచ్చిగా చెప్తాను

నవ్వు జల్లులు
మంచివి కావచ్చు
కన్నీటి చుక్కలు
పవిత్రమైనవి

- జాధవ్ అంబదాస్
9490231380

మృత్యులేఖిని !!

బ్రతికుండగనే రాబందులు
అవయవాలను ఒక్కొక్కటిగా
ఎగరేసుకు పోతున్నాయి

గరుత్మంతుడో, గద్దో, రాబందో
ఏదైతేనేం అన్నీ పీక్కుతినేవే !
పాలుపోస్తున్నాము మనం
కాటెయ్యదా మరి కాలనాగు కదా ...!
అయినా ఓటేస్తాన్నాము మనం ..!

పచ్చని గడ్డిలా మొలవడం కూడా
నేరమవుతుంది ! వాడు గాడిదలా
రూపాంతరం చెందుతున్నాడు

బాల్యాన్ని, యవ్వనాన్ని
మూటగట్టుకు తిరగాలేమో ??
వాడు బ్రూణహత్యలు చేసి
మన పంచకు నిప్పెడుతున్నారు
ప్రాణాలను తోడేసి తాగేస్తున్నారు !

మన ప్రేమలు పరువు మంటల్లో
దగ్ధమైపోతున్నాయి, మృత్యులేఖిని
పట్టుకు తిరుగుతున్నారు వాళ్ళు

బతుకులచుట్టు వృత్తంగీస్తున్నాడు
కాలు బయటపెడితే కాటేస్తున్నాడు
వాడి అంగమే ఆయుధమై
ఆడజన్మను
అంతం చేస్తుంది !?

యుద్ధమైతే ఓడినా గెలిచినా సరే
దేహం శకలాలు శకలాలుగా
తెగిపడినా సరే !
దానికి ఎవరైనా సిద్ధమే !

ఇది చొరబాటు,
నిత్యం కామ ఉల్లంగన,
శత్రువు చొరబాటులా
దేహ సరిహద్దులు
దాటి మానాన్ని ఆక్రమించి
మంటగలిపి మాటను
ముక్కలు ముక్కలుగా
తుంచేస్తున్నారు!!

- దుగ్గినపల్లి ఎజ్రాశాస్త్రి
8096225974

నేలతల్లి సాక్షిగా నాగటితరం నవల
సమకాలీన సంప్రేక్షణ

"గాయపడిన కవి గుండెల్లో వ్రాయబడని కావ్యాలెన్నో?" (దాశరథి సాహిత్యం. అగ్నిధార.పుట:75) అని దాశరథి పాట రాసినట్లు, చరిత్రలో రాయబడని గొప్ప జీవితాన్ని నందిని సిధారెడ్డి గారు రికార్డు చేయడం ఎంతైనా ముదావాహం. నందిని సిధారెడ్డి సమకాలీన తెలుగు సాహిత్యంలో ప్రముఖ రచయిత, కవి, సామాజిక కార్యకర్త. తెలంగాణ ఉద్యమంతో పాటు, కాలానుగుణంగా తన రచనల ద్వారా ప్రజలను చైత న్యవంతం చేసిన గొప్ప సాహిత్య శిఖరం. అంతే కాకుండా నందిని సిధారెడ్డి కేవలం ఒక రచయిత మాత్రమే కాదు, ఆయన ఒక ఉద్యమం. తెలంగాణ భాష, సంస్కృతి, అస్తిత్వాన్ని తన కలం ద్వారా ప్రపంచానికి చాటి చెప్పిన దార్శనికుడు. నందిని సిధారెడ్డి గారు 1954 సం.లో సిద్దిపేట జిల్లా, బందారం గ్రామంలో 'రత్నవ్వ, బాలసిద్ధారెడ్డి' పుణ్యదంపతలకు జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి తెలుగు సాహిత్యంలో పిహెచ్.డి. పట్టా పొందారు. ఆయన వృత్తిరీత్యా అధ్యాపక సేవ లందించి పదవీ విరమణ పొందారు. 'మంజీరా రచయితల సంఘం', 'తెలంగాణ రచయితల వేదిక', 'తెలంగాణ రచయితల సంఘం' మొదలైన సంస్థలు నిర్వహించారు. తెలంగాణ సాహిత్య అకాడెమి తొల అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు.

సిధారెడ్డి గారి సాహిత్యం తెలంగాణ మట్టి వాసనను, మనుషుల వేదనను ప్రతిబింబిస్తుంది. వీరు 'భూమి స్వప్నం, సంభాషణ,ప్రాణహిత, ఒక బాధగాదు, నది పుట్టువడి' మొదలైన 8 కవితా సంపుటాలు, రెండు వ్యాస సంపుటాలు, చిత్రకన్ను, బందారం కథలు, వందకు పైగా ముందుమాటలు రాసి 'నాగటి తరం' ద్వారా మనముందుకు కోత్త కోణంతో వచ్చారు. వారు తెలంగాణ ఉద్యమంలో రాసిన 'నాగేటి చాళ్లల్ల నా తెలంగాణ' పాట ప్రతి ఇంటా మారుమోగింది. పాట ద్వారా తెలంగాణ పల్లె సౌందర్యాన్ని, అక్కడి కష్టాలను అద్భుతంగా వర్ణించారు. వారు చేసిన సాహిత్య సేవకు అనేక విశ్వవిద్యాలయం పురస్కారాలతో పాటు, అనేక ప్రజా సంస్థల అవార్డులు, నంది అవార్డు కూడా అందుకున్నారు.

జీవితంలో ఏమి మాట్లాడుతారో, రచనల్లో కూడా అలాగే రాసిన గొప్పకవి, రచయిత. నందిని సిధారెడ్డి అంటేనే సరళత, సౌమ్యతకు మారుపేరు. ఎంతటి ఉన్నత పదవుల్లో ఉన్నా తన మూలాలను మర్చిపోని మనిషి ఆయన. అందుకే తెలుగు కథలు,కవిత్వం, నవల ఆయన పుట్టిన ఊరుబాట పట్టాయి. తెలంగాణ యాసను, భాషను చిన్నచూపు చూసే కాలంలో గర్వంగా తన మాతృభాషలో (తెలంగాన మాండలి కాల్లో) సాహిత్యాన్ని సృష్టించి, తెలంగాణ సాహిత్య గౌరవాన్ని పెంపొందించారు. రచనలు రాయడంలో ఎంత సక్సెస్ అయ్యారో, ఆ రచనలకు టైటిల్ పెట్టడంలో కూడా అంతకంటే ఎక్కువ సక్సెస్ అయ్యారని చెప్పవచ్చు. అవి పాఠకులను తవవైపు ఆయస్కాంతంలా లాక్కొని, పదార్థంలాగా వాస్తవాన్ని వ్యాపిం పజేశా యని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

నవల ఇతివృత్త విశ్లేషణ:

'నాగటితరం' నవల '1 ఆగస్టు 2022 నుండి 26 సెప్టెంబర్ 2022' మధ్యకాలంలో అనగా 56 రోజుల్లో రచించారు. ఈ నవల రచయిత తండ్రి జీవితాన్ని కేంద్రబిందువుగా చేసుకొని రాసిన గ్రామజీవన గాథ. వాసిరెడ్డి నవీన్ చెప్పినట్లుగా ఇది ఒక మనిషి కథ మాత్రమే కాదు, ఒక గ్రామ చరిత్ర కూడా.

నవల ప్రధాన పాత్ర బాసిరెడ్డి. కథ స్థలం 'బందారం' గ్రామం. మొత్తం 25 అధ్యాయాలుగా సాగిన ఈ రచనలో బాసిరెడ్డి జీవిత పోరాటాలు, త్యాగాలు, నాయకత్వ లక్షణాలు చిత్రించబడ్డాయి. భూమి కోసం, న్యాయం కోసం, పేదల కోసం ఆయన చేసిన పోరాటాలు కథకు మూలాధారం. చదువుకున్న యువకుడు భూపాల్ గ్రామానికి వచ్చి బాసిరెడ్డి ద్వారా రైతాంగ పోరాటాల, దొరలు అణిచివేత, రజాకార్ల దోపిడి గురించి తెలుసుకుంటాడు. బాసిరెడ్డి గ్రామ ప్రజలను ఐక్యంగా ఉంచి సంఘాలను ఏర్పాటు చేసి కమ్యూనిస్టు సిద్ధాంతాలను పరిచయం చేస్తాడు. 'దున్నేవానిదే భూమి' వంటి నినాదాలతో సాగిన నాగలి పోరాటాలు గ్రామ చైతన్యాన్ని ప్రతిబింబిస్తాయి.

బాసిరెడ్డి భార్య రత్నవ్వ అతనికి బలమైన ఆధారం. గ్రామంలో పంచాయితీలు చేసి కుటుంబాలను కలపడం, కరువు సమయంలో ప్రజలకు అండగా నిలవడం, అన్యాయానికి ఎదురు నిలవడం వంటి లక్షణాలు అతని వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి. ఎమర్జెన్సీ కాలం, నక్సలైట్ ఘటనలు వంటి రాజకీయ పరిణామాలు కూడా కథలో ప్రతిఫలిస్తాయి. చివరికి పార్టీకి రాజీనామా చేసినప్పటికీ, ప్రజల పట్ల ప్రేమను వదలడు. ప్రాణాలను పణంగా పట్టి బావిలో పడినవారిని "గింత ఆపతిల అక్కరకు రాని బొంది ఉంటే ఏంది? పోతె ఏంది? ఉండి మాత్రం పడగొట్టేదేముంది"(పుట:148) అంటూ దిగి, కొంత మందిని కాపాడుతాడు.ప్రజల కోసం చివరివరకు నిరీక్షించే నాయకుడిగా నిలిచి, అతని మరణంతో నవల ముగిస్తుంది.

నాగటి తరం నవల - సమకాలీన సంప్రేక్షణ:

ఒక జీవితాన్ని, ఒక సంఘటనను లేదా భావనను అర్థం చేసుకునే ప్రస్తుతకాలంలోని సామాజిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులు, నేటి మానవ విలువల కాంతిలో అర్థం చేసుకునే దృష్టికోణమే సమకాలీన సంప్రేక్షణ. సాహిత్యం జీవవంతంగా ఉండేదుకు సహాయపడుతూనే, నేటి తరానికి ఆ రచనలు దగ్గరగా అనిపిస్తూ, ఆలోచన వికాసాన్ని, సమాజ మార్పునకు దోహదం చేసేలా, ఉండేదుకు రచయిత సమకాలీన సంప్రేక్షణను కలిగి ఉంటాడు. కొన్నిసార్లు తనకు తెలియకుండానే రచన నుండి అవతలి వైపుకు తొంగిచూస్తుంటాడు. ప్రస్తుత సామాజిక, రాజకీయ పరిస్థితుల పరిగణలోకి తీసుకుంటూ, మారుతున్న విలువలను (మానవ హక్కులు, స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం) దృష్టిలో తీసుకుంటూనే ప్రశ్నించే స్వభా వంతో బహుళ దృష్టికోణాలను ఆవిష్కరించే ప్రయత్నం చేస్తాడు. సమాజంలో అన్ని వర్గాల వారిని సమానంగా చూసే దృష్టికో ణాన్ని, అత్యంత ప్రగతిశీల భావాలను, పేద ధనిక బేధాలు లేకుండా, స్త్రీ పురుషుల అసమానతను, సామాజిక, ఆర్థిక, శ్రామిక పరివర్తనను, ఊపిరే ఊరుగా, అత్యంత సహజమైన, వాస్తవికతతో కూడిన జీవితాన్ని సాహిత్యంలో రికార్డు చేస్తుం టారు. నందిని సిధారెడ్డి 'నాగటితరం' నవలలో చేసింది కూడా అలానే. అందుకే నవల టైటిల్ కూడా వ్యవసాయ జీవనానికి ప్రతీక. నాగలి పట్టుకుని భూమిని దున్నేరైతు జీవితం, అతని కష్టం, ఆశనిరాశలతో పాటు ఒక తరం మాత్రమే కాకుండా వ్యవసా యాన్ని జీవనాధారంగా చేసుకొని, కష్టాన్ని గౌరవంగా స్వీకరించి, ప్రకృతితో సహజీవనం చేసిన తరతరాల జీవితంగా ప్రతికాత్మకంగా ఉండాలని భావించి టైటిల్ పెట్టారు.



ఈ నవలలో "వస్తు పరిణామం, ప్రక్రియ పరిణామం, ఇవన్నీ మారుతున్న సమాజం యొక్క ఫలితాలుగా ఎలా ఆవిష్కరించబడ్డాయో విపులీకరించాడు"(పుట:15) అంతేకాకుండా మట్టిని నమ్ముకొని ఊరిని కాపాడిన ఒక రైతు జీవితాన్ని వస్తువుగా తీసుకోవడం ఇంతకుముందు తెలుగునవలల్లో ఉన్నా, డా.కేశవరెడ్డి నవలల్లో పాత్రలుగా దీన్ని రచయిత ముందుకు తీసుకెళ్తాడు. వ్యక్తి పోరాటం, ఆరాట, ప్రశ్నించేతత్వం మొదలైన సమకాలీన సంప్రేక్షణ ఇందులో కనిపిస్తాయి. వాటితో పాటు 1.మానవీయ విలువలు 2. తెలంగాణ ప్రాంత చైతన్యం 3. రజాకార్లను తరిమిన వైనం 4. భూస్వామి నుండి బంజారు భూములను సాధించిన తీరు 5. భూమికోసం పార్టీ చేసిన పోరాటం 6. 1975లో 'గిరాయిపల్లిలో' జరిగిన మొదటి ఎనౌకౌంటర్ 7. అవినీతి, అన్యాయం, ఆరాచకత్వం పై పోరాటాలు 8. ప్రజల ఆశలు, ఆశయాలు 9. వామపక్ష ఉద్యమ ప్రభావం 10. శ్రమ జీవనం 11. ఆకలి పోరాటాలు 12. వ్యవసాయం 13. కరువు 14. కుటుంబ సంబంధాలు 15. ఆహారపు అలవాట్లు 16. పేదరికం 17. దొరలు పెత్తనాలు 18. రైతులు 19. షావుకార్లు వారి పాత్ర 20. ఎమర్జన్సీ పరిస్థితులు 21. నవల ఎత్తుగడ, ముగింపులు 22. తెలంగాణ పల్లె భాష 23. సామెతలు 24. పార్టీ సిద్ధాంతాలు మొదలైన అంశాలతో సవల సమకాలీన సమాజాన్ని చిత్రిస్తూనే బాసిరెడ్డి జీవనాన్ని విశదీకరించింది.

బందారం గ్రామం నుండి మొదలైన బాసిరెడ్డి చైతన్యం, ఎంతోమందికి మార్గాన్ని చూపింది. శ్రామికతత్వం నుండి బానిస విముక్తి నుండి, బుర్జువా సంస్కృతి నుండి మరెందరోకి ఆదర్శంగా కనిపిస్తుంది బాసిరెడ్డి జీవన ఒంటరి పోరాటం. ***"ఈ ప్రపంచ విముక్తి కర్తవ్యాన్ని నిర్వహించడమే ఆధునిక శ్రామికవర్గం యొక్క చారిత్రక కర్తవ్యం"*** (నందూరి ప్రసాద్‌రావు. గతితార్కిక భౌతికవాదం.పుట:7) అని ఎంగెల్స్ ప్రబోధించినట్లే బాసిరెడ్డి అనుకరించాడు. అజ్ఞానంలో ఉన్న ప్రజలను చైతన్యవంతులను చేయడానికి తన కర్తవ్యం పోషించాడు. అందుకే శ్రామిక వర్గం రాజ్యాధికారాన్ని పొందాలని, బూర్జువావర్గం నుండి స్వాదీన పరుచుకొని వాటిని పబ్లిక్ ఆస్తిగా మార్చడానికి బాసిరెడ్డి సఫలీకృతుడయ్యాడు.'

ఒక ఊరి కోసం బాసిరెడ్డి పడిన తపన, ఎన్నో ఊర్లకు మార్గం చూపింది. ధైర్యాన్ని నింపింది. బానిసత్వాన్ని పొగొట్టింది. ఒక వ్యక్తి జీవితంలో కావల్సిందేమిటి? అనేక ప్రశ్నలకు సమాధానమే బాసిరెడ్డి జీవితం. చరిత్రలో రాజ్యాధికారాల కోసం ఊర్లను ధ్వంసం చేశారు. చాలా దూరం ప్రయాణం చేశారు. చివరికి ఊరు' లేని జీవితం వ్యర్థం అని తెలుసుకు న్నారు. అందుకే 'బ్యాక్ టు నేచర్ లాగా బ్యాక్ టు విలేజ్' గొప్పదనుకున్నారు. ఒక వ్యక్తి ప్రపంచానికి రాజైనా, ఒక తల్లికి, ఒక ఊరిలో జన్మించాల్సిందే. ఊరంటే విద్య, శ్రమ, సహకారం, స్వచ్ఛలు, సంస్కృతి పరిరక్షణ, అక్కడి ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రతిబింబిస్తాయి. సామాజిక సమానత్వాన్ని ఆశించే ఊరు మానవత్వానికి నిలువెత్తు ఉదాహరణంగా నిలుస్తుంది. ఒకరి కష్టంలో మరొకరు నిలబడడం ఊరి సమజ లక్షణం. భిన్నమైన మనుషులు ఒకేచోట కలిసి జీవించడం, పోరాడడం, ప్రతిఘటించడం, ధర్మమార్గాలను అన్వేషించడం, ఊరు తరతరాల వారసత్వ సంపదను అందిస్తుంది. బాసిరెడ్డి లాంటి నాయకులు అటువంటి ఊరి కోసం చేసిన పోరాటాలు, తర్వాత పాలనకు దిక్సూచిగా మారింది.

డా.జరుపుల రమేష్
అసోసియేట్ ప్రొఫెసర్,
తెలుగు విభాగం,
కాకతీయ ప్రభుత్వ
కళాశాల, (స్వయం
ప్రతిపత్తి), హనుమకొండ.
ఫోన్: 9618944654,

అక్షర వసంతాలతో సమాజాన్ని మేల్కొల్పండి

కాలం చెల్లిన వస్తువులకు అక్షర దర్పణం ఎందుకు?
సమకాలీన సంధిలో రెక్కలు విరిగిన పక్షిలా
మబ్బుల దుప్పటిలో భూమాత అవస్థలు
పచ్చని ఆకుల్లో విషపు బిందువులు కనపడవా?

కల్తీ యుగంలో ధనపు చెట్టుపై వాలిన పక్షులు
అవినీతి తీగల్లో చిక్కుకున్న సమాజం
కళ్ళున్న గుడ్డివాడిలా చూస్తున్న ప్రభుత్వం
ఎడు చేపల కథల తయారైన మనుషుల మనస్తత్వం

ఎన్ని రెక్కలు జీవితపు మధ్యలో కోల్పోతున్నాయో!
నేల పుత్రుడు దళారీ చేత దగా పడి
బంగారపు పొలంలో తనువును పూడ్చిపెట్టి
మరో తరానికి తాను కళేబరంగా మిగిలిపోయే...

తీక్ష్ణమైన కళ్ళకు నేలా అరుపులు చూడవా?
గర్భశోకంలోని మాటలు వినిపించవా?
కాల పురుగు తినేసే లేత జీవితాలు కనిపించవా?
ప్రతి అణువులో నల్లటి చాయలు ప్రవహిస్తున్నాయి..

గంభీర సముద్రం కన్నీళ్లు కారుస్తూ
ఉప్పు చుక్కలో విష వలయం తిరుగుతుంది
ఆశా జీవులన్నీ అల్ప జీవులుగా మారుతూ
తమ ఉనికిని తాము ప్రశ్నిస్తూ జీవిస్తున్నాయి

కళ్ళ ముందు సత్యాలకు అక్షర ప్రతిష్ఠ చేసి
కాలం చెల్లిన రంగుల కవిత్వాన్ని పక్కనపెట్టి
జీవం కోల్పోతున్న ప్రకృతికి ప్రాణవాయువు ఇచ్చి
అక్షర వసంతాలతో సమాజాన్ని మేల్కొల్పండి!

కొప్పుల ప్రసాద్,
నంద్యాల, 9885066235

సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం తీసుకురావాలని అనుకుంటుంది. దీనిలో వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలు మొదలైన సాహితీ పరమైన రచనలను ఆహ్వానిస్తున్నాం. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్ కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064